క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి పింఛన్ విరాళం

మరికల్: మండల కేంద్రంలోని పెద్ద చెరువు ఆనకట్టపై పునఃనిర్మాణం చేస్తున్న కట్ట మైసమ్మ ఆలయ నిర్మాణానికి మాజీ తిరువ సంఘం ఉపాధ్యక్షుడు మంగళి నారాయణ తన పింఛన్ డబ్బులను విరాళంగా అందజేశారు. మంగళవారం తన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులని కలిసి రూ. 5116 వారికి అందజేశారు. అలాగే మరికల్ యువక మండలి మాజీ అధ్యక్షుడు హరిప్రసాద్ రూ. 5116, బ్యాగరి రవి రూ.1116 నగదు అందజేశారు. కార్యక్రమంలో మల్లయ్య, రవి, అశోక్, వేణు, మల్లేష్ పాల్గొన్నారు.

మాగనూర్‌ను అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలి

మాగనూర్: మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లాలని ఎంపీడీఓ శ్రీనివాసులును కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు కోరారు. మాగనూర్ ఎంపీడీఓగా ఇటీవల ఆయన బాధ్యతలు చేపట్టడంతో మంగళవారం ఆయనను కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలుచేసి లబ్ధిదారులందరికీ న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోస్గి రూరల్: గుండుమాల్ మండల పరిధిలోని మాసాయపల్లి, బోగారం, భక్తిమళ్ల గ్రామాలలో బుధవారం కరెంట్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ భానోదయ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తిమళ్ల ఫీడర్ పరిధిలో ట్రీ కటింగ్ చేస్తున్నందున ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అమెరికా తీరుతో ప్రపంచశాంతికి భంగం



నారాయణపేట: ప్రపంచ శాంతికి భంగం కలిగిస్తున్న అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధోన్మాదాన్ని ప్రధాని మోదీ ఖండించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అణ్వాయుధాలు ఉన్నాయన్న నెపంతో ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా దేశాలు దాడికి దిగడం దారుణన్నారు. వెంటనే దీనిని ప్రపంచ దేశాలు ఖండించాలన్నారు.

ట్రంప్ దిష్టిబొమ్మ దహనం

మద్దూరు: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయేల్ కొనసాగిస్తున్న యుద్ధాన్ని ఆపాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం మద్దూరులోని పాతబస్టాండ్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఇరాన్‌పై ఆధిపత్యం కోసం ఇజ్రాయేల్, అమెరికా దాడులకు తెగబడుతున్నట్లు తెలిపారు. అనంతరం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టి బొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో మాస్‌లైన్ సబ్ డివిజన్ కార్యదర్శి కొండా నర్సింములు, నారాయణ, నర్సిములు, అంజి, విజయ్, ఆంజనేయులు, లాలు, హన్మప్ప, హసీన్, చెన్నప్ప పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

కోస్గి రూరల్: తన వ్యవసాయ పొలం కింద ఉన్న ఇసుకను తరలించవద్దన్నందుకు వ్యక్తిపై దాడి చేయడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన మండలంలో మంగళవారం చోటు చేసుకంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. ముశ్రీఫా గ్రామానికి చెందిన బుక్క సయ్యద్ తనకున్న పొలం కింద ఇసుకను తరలించవద్దన్నందుకు అదే గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు అతడిపై దాడి చేశారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు.

విద్యార్థులకు బుక్స్, బ్యాగుల వితరణ

మక్తల్: మండలంలోని గడ్డంపల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠశాలలో పని చేసే ఎస్ఎం మదన్ మిత్రులు సతీశ్, గణేష్, రాజు, శ్రీకాంత్, వెంకటేశ్, మహేందర్, జనార్దన్‌రెడ్డి, మల్లేష్ యాదవ్, ప్రశాంత్, తిరుపతి విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్, పెన్నులు, బ్యాగులు, బెల్టు, పెన్సిల్‌లను అందజేశారు. ఈ క్రమంలో పేద విద్యార్థుల చదువుకు అండగా నిలిచిన మదన్ మోహన్ మిత్రబృందాన్ని పాఠశాలలోని ఉపాధ్యాయులు అభినందించారు.

రైతు సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



కలెక్టరేట్‌లో సీఎం ముఖాముఖిని వీక్షిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, అధికారులు



మక్తల్‌లో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రైతుల ఖాతాల్లో రైతు భరోసా కింద నగదును జమచేసింది. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం కింద నగదు అందజేసింది. ఈక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు రైతులతో కలిసి రైతు భరోసా సంబరాలు జరుపుకున్నారు.

● నారాయణపేట కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సిక్తా పట్నాయక్.. సీఎం రేవంత్‌రెడ్డి నారాయణపేట మండలంలోని సింగారం రైతు వేదిక నుంచి నిర్వహించిన ముఖాముఖిని వీక్షించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

● మక్తల్‌లో ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తుందని మార్కెట్ వైస్ చైర్మన్ గణేశ్ కుమార్ తెలిపారు. రైతు భరోసా డబ్బులను జమ చేయడంతో స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతనం బాణా సంచా కాల్చి ఆనందం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, డాక్టర్ శ్రీహరికు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మందుల నరేందర్, రవికుమార్, కట్ట సురేశ్, నారాయణ, గోవర్ధన్, శ్రీనివాసులు, భాస్కర్ పాల్గొన్నారు.

● మరికల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాగాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ తొమ్మిది రోజుల వ్యవధిలోనే రైతులందరిరీ రైతు భరోసా డబ్బులను వారి ఖాతాల్లో జమ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రైతుల కళ్లల్లో ఆనందం చూడటమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, వీరన్న, రామకృష్ణ, హన్మంతు, ఆనంద్‌కుమార్, అంజిరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, గోవర్ధన్, చెన్నయ్య, మల్లారెడ్డి, రాజారెడ్డిలు పాల్గొన్నారు.



మరికల్‌లో కాంగ్రెస్ నాయకుల సంబరాలు

● కోస్గిలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్లను రైతు భరోసా కింద రైతుల ఖాతాల్లో జమచేయడం అభినందనీయమని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని చంద్రవంచ, సర్జఖాన్‌పేట్, ముశ్రీఫా రైతు వేదికలలో రైతు భరోసా సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, తహసీల్దార్ శ్రీనివాసులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

● ఊట్కూరులోని రైతు వేదిక దగ్గర మంగళవారం సీఎం చిత్రపటానికి రైతులు పాలాభిషేకం చేశారు. అంతకుముందు సంబరాలలో భాగంగా రేవంత్‌రెడ్డి, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావుగారి ప్రసంగాన్ని రైతులు టెలికాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు.

● దామరగిద్ద మండలంలోని దామరగిద్ద, లోకూర్తి, బాపన్‌పల్లి రైతు వేదికల్లో రైతులు, అధికారులు సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో నిర్వహించిన ముఖాముఖీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

నారాయణ పేట క్రైమ్: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని నారాయణ పేట రూరల్ ఎస్ఐ రాముడు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం ,అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాలను పురస్కరించుకొని మంగళవారం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జాజపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. సరదా కోసం మొదలైన అలవాటు మత్తులోకి నెడుతుందని. ఎవరైనావ్యసనాల బారిన పడినట్లయితే రాష్ట్ర యాంటీ నార్కొటిక్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్ 1908, డయల్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ నవీద్

కృష్ణా: విద్యార్థులు మత్తు పదార్థాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్ఐ ఎండీ నవీద్ సూచించారు. మంగళవారం మండలంలోని గుడెబల్లూర్ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతకు ముందు పాఠశాల ఆవరణలో చెట్లు నాటారు. అనంతరం మాట్లాడుతూ చదువుకునే సమయంలో విద్యార్థులు సిగరెట్, మందు తాగడం, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలైతే బంగారం లాంటి భవిష్యత్ నాశనం అవుతుందన్నారు. విద్యార్థులు తమ చదువుపై దృష్టి సారించి గొప్ప విజయాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గణేష్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయితో జీవితం నాశనం

కోస్గి రూరల్: విద్యార్థులు డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ సైదులు అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత మాదవ ద్రవ్యాలకు అలవాటు పడితే నేర ప్రవృత్తి పెరుగుతుందన్నారు. తద్వార కుటుంబ సభ్యులు దూరమై ఆర్థికంగా నష్టపోతారన్నారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండి బంగారు భవిష్యత్‌కు పునాది వేసుకోవాలని సూచించారు.

రేషన్ కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కోస్గి రూరల్: మండల పరిధిలోని ప్రజలు నూతన రేషన్ కార్డుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మండల తహసీల్దార్ బక్క శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీపంలోని మీ సేవ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు అనంతరం సంబంధిత పత్రాలను కార్యాలయంలో సమర్పించాలన్నారు. అలాగే రేషన్‌కార్డులో పేర్ల తొలగింపునకు సంబంధించి కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

మక్తల్ కమిషనర్‌గా శంకర్‌నాయక్

మక్తల్: మక్తల్ మున్సిపల్ కమిషనర్‌గా శంకర్ నాయక్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం మక్తల్ ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన బదిలీల్లో భాగంగా మున్సిపల్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తానన్నారు.

ఆత్మకూర్ అభివృద్ధికి రూ.15 కోట్లు

ఆత్మకూర్: మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆత్మకూర్ పట్టణాభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరు చేశారని కాంగ్రెస్ నాయకులు రహ్మతుల్లా, పరమేష్ తెలిపారు.మున్సిపాలిటీలో రోడ్డు నిర్మాణం, సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించేందుకు నగదును మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

మద్దూరు: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులందరూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఇంటి నిర్మాణం చేపట్టాలని హౌసింగ్ ఏఈ శాంతుకుమార్ తెలిపారు. పట్టణంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను అధికారులు మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రెండు ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ వేసి పనులు ప్రారంభించారు. లబ్ధిదారులందరూ వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహా, కాంగ్రెస్ నాయకులు సంజీవ్, మల్లికార్జున్, బాల్‌రాజ్, హుసేన్ పాల్గొన్నారు.



మద్దూరులో ఇంటికి భూమిపూజ చేస్తున్న అధికారులు

రైతులకు కంది విత్తనాలు పంపిణీ

మద్దూరు: మద్దూరులోని రైతు వేదికలో మంగళవారం రైతులకు ఉచితంగా కంది విత్తనాలను పంపిణీ చేశారు. కంది సాగును ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఎల్ఆర్‌జీ 52 రకం, పీఆర్‌జీ 176 రకం కంది విత్తనాలను అందజేసినట్లు ఏఈఓ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ప్రస్తుతం 4 కేజీల బస్తాలు అందుబాటులో ఉన్నాయని అవసరమైన రైతులు పట్టాదారు పాసు పుస్తకం తీసుకొచ్చి విత్తనాలు తీసుకెళ్లాలని సూచించారు. అంతకు ముందు రైతు వేదికలో సీఎం రైవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, రైతులు పాలాభిషేకం చేశారు. రాష్ట్రంలో రైతులందరికీ రైతు భరోసా డబ్బులు వేయడంతో పాలాభిషేకం చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కోస్గి ఏఎంసీ చైర్మన్ భీములు, పీఏసీఎస్ చైర్మన్ నర్సింహ, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు బాబుస్వామి, రవీందర్‌రెడ్డి, చంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.



మద్దూరులో కంది విత్తనాలు అందజేస్తున్న నాయకులు అధికారులు

రెవెన్యూ, అటవీ శాఖ అధికారుల సర్వే

కృష్ణా: మండలంలోని ముడుమాల్ గ్రామ శివారులో గల 192, 194 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిని మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. గతంలో ఈ సర్వే నంబర్లలోని 70 ఎకరాల భూమిని అధికారులు జింకల పరిరక్షణకు కేటాయించారు. అయితే ఇలా కేటాయించిన భూమి చాలా వరకు చెరువులో ఉండడంతో అందులో నీళ్లు నిలిచే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో సర్వే నిర్వహించి చెరువు కిందకు రాని భూమిని అటవీశాఖకు కేటాయించనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ అమరనాథ్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది మహాదేవ్, అటవీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు



కృష్ణా: వర్షం కురవాలని కోరుకుంటూ మండలంలోని రైతులు, మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందస్తుగా వర్షం కురవడంతో మండలవ్యాప్తంగా అనేక మంది రైతులు పంటల సాగు చేపట్టారు. అయితే 15 రోజుల నుంచి వానజాడ లేకపోవడంతో మొక్కలు ఎండుముఖం పట్టడంతో రైతులు, చిన్నారులు గ్రామ దేవతలకు నీళ్లు పోసి పూజలు జరిపించారు. ఖాన్‌దొడ్డి గ్రామ ప్రజలు అంబలి బోనాలను నల్లగట్టు మారెమ్మ దేవతకు తీసుకొచ్చి పూజలు నిర్వహించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



కస్తూర్బా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి



ఊట్కూరులోని మల్లెపల్లి పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నర్వ: విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని ఎంఈఓ రాంరెడ్డి సూచించారు. మంగళవారం సీపూర్, రాజుపల్లి పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి, వారితో పాఠాలు చదివించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వంట ఏజెన్సీలతో మాట్లాడారు. విద్యార్థులకు అందించే పౌష్టికాహారం మెనూ ప్రకారం రుచి, శుచికరంగా అందించాలన్నారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎంఈఓ

కృష్ణా: మండలంలోని ఆలంపల్లి ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఎంఈఓ నిజాముద్దీన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, సమయపాలన, మధ్యాహ్న భోజనం తదితర అంశాలను పరిశీలించారు.

కృష్ణా మండలంలోని కున్సీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం మండల ప్రత్యేక అధికారి ఖలీల్ అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటశాలలోని పరిసరాలు, కూరగాయలు, బియ్యం నిల్వ, పరిశుభ్రత, వంటలకు వాడే సామగ్రి నాణ్యతను పరిశీలించారు.

పౌష్టికాహారాన్ని అందించాలి

ఊట్కూరు: విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలని ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ అన్నారు. మంగళవారం మల్లెపల్లి యూపీఎస్ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం మెనూను ఏజెన్సీ నిర్వాహకులను అడిగి తెలుసుకొని మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలు, ఎంపీఓ లక్ష్మినర్సింహరాజు, కార్యదర్శి సుమన్ పాల్గొన్నారు.

నాణ్యత పాటించాలి

మాగనూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మాగనూర్ ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించి, నాణ్యత పాటించాలని వంట సిబ్బందిని ఆదేశించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మక్తల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొండయ్య అన్నారు. మక్తల్‌లో ఎఆర్ఎం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం 'వికసిత్ భారత్' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మోదీ 11 ఏళ్ల పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లి త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం మండల అర్బన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన సభ్యులందరూ బూత్ లెవల్ నుంచి మండల స్థాయి వరకు బీజేపీని బలోపేతం చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొండయ్య

గంగమ్మ గోర్ల గడ్డను రక్షించాలి

ఊట్కూరు: హిందూ స్మశాన వాటిక అయిన గంగమ్మ గోర్ల గడ్డను రక్షించాలని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ గరిడి లింగిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఊట్కూరులో గంగమ్మ గోర్ల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో తహసీల్దార్ చింతరవికి వినతిపత్రం అందించారు. నారాయణపేట ఎత్తిపోతల పథకంలో భాగంగా ఊట్కూరు చెరువు రిజర్వాయర్‌గా మారుతుందని దీంతో గంగమ్మ గోర్ల గడ్డ నీటిలో మునిగే ప్రమాదం ఉందన్నారు. ఈ శ్మశాన వాటికలో పూర్వీకుల సమాధులు ఉన్నాయని ఇవి నీటిలో మునిగితే వారి కుటుంబీకుల మనోభావాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి శ్మశాన వాటికను ముంపునకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గోపాల్‌రెడ్డి, వడ్ల మోనప్ప, మోహన్‌రెడ్డి, జగన్నాథ్ రావు, కొండన్‌గోపాల్, యజ్ఞేశ్వర్‌రెడ్డి, ఆశప్ప తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామ పెద్దలు

బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలి



ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు

ధన్వాడ: తమ బకాయి వేతనాలు చెల్లించాలని పంచాయతీ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలరామ్ మాట్లాడుతూ మూడు నెలల నుంచి పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబాలు గడవక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాలను శుభ్రంగా ఉంచుతున్న కార్మికులను చిన్నచూపు చూస్తే ఊరుకోమన్నారు. అనంతరం ఎంపీడీఓ శోభారాణికి వినతి పత్రం అందజేశారు.

కార్యాలయం ఎదుట ధర్నా

దామరగిద్ద: గ్రామ పంచాయతీ కార్మికులకు గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే అందజేయాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్ డిమాండ్ చేశాడు. ఈ మేరకు మంగళవారం స్థానిక కార్మికులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ఎస్సీ హాస్టల్

- నేడో రేపో కూలిపోయేలా భవనం
- బూత్ బంగ్లాను తలపిస్తున్న హాస్టల్
- ఇరుకు గదుల్లో విద్యార్థుల అవస్థలు



పెచ్చులూడి శిథిలావస్థకు చేరిన హాస్టల్ ప్రాంగణం

ధన్వాడ: మండల కేంద్రంలోని అప్పాజీనగర్‌లో ఉన్న ఎస్సీ హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరుకుంది. అధికారులు వస్తున్నారు.. చూస్తున్నారు తప్ప మరమ్మతు చేసేందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఎస్సీ విద్యార్థుల కోసం మండల కేంద్రంలో 2006లో ఈ భవనాన్ని నిర్మించారు. భవనం నిర్మించి దాదాపు 20 ఏళ్లు కావడంతో ప్రస్తుతం అది శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కురిసినప్పుడు భవనం పైన నీరు నిలిచి లీకేజీ అవుతుండడంతో గదులన్నీ బూజు పట్టి బూత్ బంగ్లాను తలపిస్తుంది. అలాగే పైకప్పు కూలిపోయే స్థితికి చేరుకుంది. విద్యార్థులు భోజనం చేసే డైనింగ్ రూమ్ కూడా పెచ్చులూడి కింద పడిన ఘటనలు ఉన్నాయి. విద్యార్థులు పడుకునే రూములు కూడ సరైన వసతులు లేక ఇరుకు ఇరుకు గదుల్లోనే పడుకుంటూ అవస్థలు పడుతున్నారు.



అధ్వానంగా తయారైన హాస్టల్ గది

7 గదుల్లో 263 మంది విద్యార్థులు

ప్రస్తుతం హాస్టల్‌లో 12 గదులు ఉండగా విద్యార్థులు ఉండేందుకు 7 మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. ఈ గదుల్లో ఒకటి స్టోర్ రూమ్, కిచెన్, ఆఫీస్ రూమ్, ఒకటి విరిగిపోయిన వస్తువుల కోసం కేటాయించారు. ఇక మిగిలిన 7 రూముల్లోనే విద్యార్థులు ఉంటున్నారు. ఇందులో మొత్తం 263 మంది విద్యార్థులు ఉండగా ఇటీవల పదో తరగతి పాస్ అయిన 40 మంది విద్యార్థులు వెళ్లిపోయారు. ఇప్పుడు కొత్త అడ్మిషన్‌లు జరుగుతుండడంతో విద్యార్థుల సంఖ్య తిరిగి 260కి చేరుకునే అవకాశం ఉంది. ఇక ప్రస్తుతం ఉన్న 200 మంది విద్యార్థుల్లో ఒక గదిలో దాదాపు 30 విద్యార్థులు ఉంటున్నారు. దీంతో కొంత మంది బెడ్‌లపై మరి కొంతమంది కింద పడుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరుబయటికి వెళ్లాల్సిందే

హాస్టల్‌లో మొత్తం 11 మరుగుదొడ్లు ఉండగా ఇందులో వాడుకోవడానికి 3 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో ఉదయం సమయానికి పాఠశాలకు వెళ్లడానికి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాత్‌రూమ్‌ల కోసం పోటీ నెలకొనడంతో అనేక మంది విద్యార్థులు సౌచాలయానికి ఆరుబయటికి వెళ్లి, చల్ల నీటితోనే స్నానం చేసి పాఠశాలకు వెళ్తున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి సమస్య



హాస్టల్ పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. నేను కొత్తగా విధుల్లో చేరాను. మరమ్మతు చేసేందుకు టెండర్ పిలిచినా ఎవరు రావడం లేదని తెలిసింది. హాస్టల్‌లో నెలకొన్న సమస్యలన్నింటినీ పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాను.

– సాయిరెడ్డి, హాస్టల్ వార్డెన్